# పాదపూజ

ప్రశంసల భారంతో, అభినందనల అతిశయంతో, పొగడ్తల తల నొప్పితో, స్తుతిస్తోత్ర వేదనతో రైలెక్కిన రామారావు మెడనిండా పూలమాలలతో, చేతుల నిండా పుష్ప గుచ్ఛాలతో, ఆలింగనాలతో, ఆశీస్సులతో వీడ్కోలు పలికిన బంధుమిత్రులతో, గురుపరంపరతో, కరచాలనం చేసిన ఆత్మీయులతో, పాదాభివాదం చేసిన పసివాళ్ళతో, అసామాన్య స్థితిలో ఊపిరాడకుండా ఉన్నాడు. మిత్రబృందం కూడా తోడుగా రైలెక్కింది.

రైలు సికింద్రాబాదు స్టేషన్‌లో వాళ్ళను ఆహ్వానించి బయలుదేరింది.

వాళ్ళు సామాన్లు సర్దుకొని చుట్టూ చూస్తే ఎవరో తొమ్మిది గంటలకే నిద్రపోతున్నాడని వాళ్ళను చూసి కూడా నిద్రలేవలేదు కాని, వాళ్ళ మాటలు, ఉత్సాహం, ఆనందం కలిగించిన కదలికలకు లోయర్‌బెర్త్ సొంతదారు మెలకువ వచ్చినా లేచి కూర్చోలేదు. పడుకునే ఉన్నాడు. మళ్ళీ నిద్రపోయే ప్రయత్నంలోనే ఉన్నాడు. హైద్రాబాద్‌లో రైలెక్కి తన బెర్త్‌మీద పడుకొని నిద్ర పోతున్నట్టున్నాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అరుదైన పురస్కారం ప్రకటించి, రవీంద్రభారతిలో కార్యక్రమం ఏర్పాటు చేసి, ప్రశంసల మధ్య ప్రశంసాపత్రం చదివి దుశ్శాలువా కప్పి, మొమెంటో ఇచ్చి, పురస్కార నిధి మొత్తం అందించి, గవర్నరు, సియం అభినందించి డాక్టరు రామారావును చాలా గౌరవించారు.

ఆ సభ సాహిత్య సభకాదు, సంగీత సన్మానం కాదు, కళా వ్యవహారం కాదు. అది వైద్యుల సభ. వైద్యవృత్తికి సంబంధించినవాళ్ళ కార్యక్రమం. డాక్టరు రామారావును సన్మానించటానికి ఆ ప్రోగ్రాం ఏర్పాటయింది.

డాక్టరు రామారావుకి రాయల్ సొసైటీలో సభ్యత్వం వచ్చింది. ఏషియాటిక్ సొసైటీ గౌరవసత్కారం ప్రకటించింది. ఫెలోషిప్పు, గౌరవ డాక్టరేటు సైన్సు కాంగ్రెసు మెంబరుషిప్పు వచ్చిన దృష్టితో ఈ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. ప్రోగ్రామ్‌కి నగరంలోని ప్రముఖ డాక్టర్లు అందరూ అన్ని పనులూ మానుకొని వచ్చారు.

పత్రికల్లో డాక్టర్ రామారావును, గౌరవాలను గూర్చి చదువుతున్న వాళ్ళకు విషయం తెలుసు కాని సామాన్యులకు తెలియదు.

శాస్త్ర విజ్ఞానాన్ని మానవ అభ్యుదయానికి మహత్తరంగా వాడే డాక్టర్లు విశ్వవ్యాప్తంగా చాలామంది ఉన్నారు కానీ, నూత్న శాస్త్ర విజ్ఞానాంశం సృష్టించే వాళ్ళు ఎప్పుడో తప్ప పుట్టరు. అట్లాంటి అరుదైన వ్యక్తి రామారావు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవలు అందించే ఇ.యస్.ఐ ఉద్యోగి డాక్టరు రామారావు. పరిశోధనతో ఏ మాత్రం సంబంధం లేని చోటు. అతను యంబిబియస్ డాక్టరు మాత్రమే! పెద్ద పెద్ద చదువులు కూడా లేవు. మామూలు మాటల్లో చెప్పాలంటే చీటీ రాసిచ్చి ఇంజక్షన్ వేసి బిపీ చూసే డాక్టరు. అరవయ్యేళ్ళు వయస్సు.

ఒకరోజు పదహారేళ్ళ యువతి తలనొప్పి మందు కోసం వచ్చింది. చాలా చక్కనమ్మాయి. పంపలేకపోయాడు. మామూలు పేషెంటు కాదు. పేరు సరళ. ఆమె జీవితం సరళం కావాలని డాక్టరు ఆశించాడు. ఆమె నేలమీద దేకుతూ వచ్చింది. దేకుతూ పోతోంది. దిగులు కలిగింది. ఆమె తల్లిదండ్రుల్ని పిలిపించాడు. మాట్లాడాడు.

ఆమె జబ్బు పోలియోకాదు. మధ్యలో కాళ్ళు పోలేదు. ఆమె పుట్టుకనుంచి అలాగే ఉంది. రెండు కాళ్ళు-కాళ్ళ పిక్కలు తొడలకు- అతుక్కుపోయి పుట్టింది. అలాగే పెరుగుతూ ఉంది. ఆమె పాదాలు నేలకానించి కూర్చుంటూ ఉంది.

డాక్టరు రామారావుకు ఆసక్తి కలిగింది. కాళ్ళు సిక్కలు తొడలు పరీక్షించాడు. అతడికి ఉత్సాహం పెరిగింది.

యస్‌యస్‌సి తర్వాత అమ్మాయి దేకుతూ పోలేక సిగ్గుపడుతుంటే కాలేజీ మాన్పించారు.

"నువ్వు కాలేజీకి పోవటం ఇష్టమా?"

దిగులుగా చెప్పింది. "ఇష్టమే". కళ్ళనీళ్ళతో చెప్పింది మళ్ళీ. "దేకుతూ పోలేను!"

"నడిపిస్తే నడుస్తావా?"

"నడిపించలేరు!" ఏడ్చింది.

"నీ కాళ్ళ మీద నువ్వు నడిచి కాలేజీకి పోవటం నీకిష్టమైతే నేను నడిపించటానికి ప్రయత్నిస్తాను"

బావురుమని ఏడ్చి డాక్టరు కాళ్ళు పట్టుకొని వదలకుండా వెక్కివెక్కి ఏడవసాగింది.

"నువ్వు నడుస్తుంటే నా కంటే పొడుగ్గా ఉంటావు తెలుసా!"

ఏడుస్తూనే ఉంది.

"అందంగా నిలబడగలవు. నీ అందం వల్ల నిన్ను కాలేజీ బ్యూటీ అనీ అంటారు".

అమ్మాయి ఆనందంగా ఏడుస్తూనే ఉంది.

"నిన్ను సినిమా వాళ్ళు చూస్తే హీరోయిన్‌ని చేస్తారు"

పిచ్చిపట్టినట్లు డాక్టరు కాళ్లు పిసుకుతూ ఉంది.

"చాలా అందగాడు. సంపన్నుడు. నిన్ను పెళ్ళాడతాడు"

ఆమె గగ్గోలుగా ఏడుస్తూ కాళ్ళు వదల్లేదు. గట్టిగా విరిగేట్టు పట్టుకుంది.

ఆమెను ఆనందంగా– భరించరాని సంతోషంతో–వెక్కి వెక్కి ఏడవనిచ్చాడు. ఉన్నట్టుండి పాదాలు గట్టిగా పట్టుకొని నన్ను మీరు నడిపిస్తే మీ పాదాలు జీవితాంతం పూజిస్తాను. నేను నడిస్తే చాలు.

పేషెంటుకు నడవాలనే పట్టుదల కలిగి ఉండేట్టు చేయగలిగాడు. తల్లిదండ్రుల్ని ఒప్పించాడు.

కాళ్ళు ఎక్స్‌రే తీయించాడు. తృప్తిగా ఉంది. నరాల పరిస్థితి పరీక్షించాడు. ఆమె పాదాలు నేలకానుతూ ఉండటం వాటి మీద బరువు మోపగలగటం డాక్టరుకు ఉత్సాహం కలిగించింది. రక్తనాళాల స్థితి, రక్తప్రవాహం ప్రసారం అంతా బాగుంది.

"సరళా! నేటి నుంచి నువ్వు నా కూతురివి"

సరళ ఏడుస్తూనే ఉంది.

"నువు నాతో సహకరిస్తే, నేను నిన్ను నాతో పరుగెత్తే పిటి ఉషను చేస్తాను"

ఆమె కృతజ్ఞతా భారంతో, భవిష్యత్తు మీద ఆశతో, పట్టలేని ఆనందంతో ఏ పరీక్షకయినా సిద్ధంగా ఉంది.

హాస్పిటల్‌లో ఉన్న అవకాశాలు పరిమితం. పరికరాలు పరిమితం. అయితే డాక్టరు ఆత్మవిశ్వాసం అపరిమితం. పేషెంటు భవిష్యదాశ అద్భుతం.

ఎముకల డాక్టరుగా అతడికి ప్రత్యేక తర్ఫీదు ఉంది కాని, దాని అవసరం లేదు. జనరల్ మెడిసిన్ మాత్రమే ఈ ఉద్యోగంలో అవసరం.

డాక్టరు తాను చదువుకోసాగాడు. పదిమంది నిపుణుల్ని పలకరించాడు. ప్రోత్సాహం తక్కువగా ఉంది.

పాప పుట్టిన దగ్గర్నుంచి నేటిదాకా ఆరాటంతో, సరళ తల్లిదండ్రులు బిడ్డను మామూలుగా చేసుకోవటానికి, చేయని ప్రయత్నం లేదు. లాభం లేకపోయింది. ఎన్నిచోట్లో చూపించారు. నిరాశ ఎదురయింది. ఎవరూ బాగుచేయలేరని తేలిపోయింది.

జీవితంలో ఏ రంగంలో అయినా శాస్త్రాన్ని అనువర్తింపచేసే అద్భుత శక్తిసంపన్నులు ఉంటారు. కాని, శాస్త్రాన్ని– నూత్న శాస్త్రాంశాన్ని సృష్టించే వాళ్ళు అరుదుగా ఉంటారు.

వాళ్ళే భవిష్యత్తును నిర్మిస్తారు. శాసిస్తారు.

అయితే వాళ్ళకు అన్నీ అమరి ఉండవు. ప్రతి అడుక్కీ తనే స్వయంగా బాట వేసుకోవలసి వస్తుంది.

అట్లా బాట వేసుకునే కృషిలో డాక్టర్‌కు పేషెంటు, ఆమె తల్లిదండ్రులు సంపూర్ణంగా సహకరించసాగారు.

"సరళ అదృష్టవంతురాలవుతుందని నాకు పూర్తి విశ్వాసం ఉంది. నా కృషి ఫలిస్తుందని గట్టి నమ్మకం ఉంది. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే ఇప్పుడున్న స్థితి కంటే కష్టం ఏమీ ఉండదు!" అని చెప్పి వాళ్ళను సంపూర్ణంగా సంసిద్ధం చేశాడు.

తనకున్న పరిమిత పరికరాలతో ఒకరోజు ఒక కాలిని తొడనుంచి వేరు చేస్తూ చర్మం–లింకు–తొలిగించాడు. రక్తం కారిపోకుండా జాగ్రత్త పడ్డాడు. కుట్లు వేశాడు. పిక్కభాగం ఇప్పుడు తొడకు అతుక్కుని లేదుకానీ, వేరయికూడా అక్కడే ఆనుకొని ఉంది. అతుక్కొని కాదు.

సెప్టిక్ కాకుండా చూచిన కాలు చర్మం పుండు నయమయిందాకా రెండో కాలి జోలికి పోలేదు.

రెండో కాలు అతుకును వేరుచేయటం ఈసారి శ్రమ కాలేదు.

రెండుకాళ్ళూ తొడదగ్గరే ఉన్నా అతుక్కొని లేవు. రోజు రోజుకు సరళ ఉత్సాహంతో ఊగిపోతూ ఉంది.

రోజూ రెండు గంటలు ఫిజియోథెరపి ట్రీట్‌మెంట్, నర్సుల మీద వదలకుండా, తానే చేస్తూ వచ్చాడు.

రెండు నెలలకు కాళ్ళు రెండూ పూర్తిగా పొడుగ్గా సాగాయి.

బెడ్‌మీద నుంచి లేవలేకుండా ఉన్నప్పటికినీ, తన కాళ్ల పొడుగు, మంచం పొడుగునా ఉండటం చూచి సరళ సంతోషానికి అవధుల్లేవు.

ఎప్పుడు లేచి నడుద్దామా అని ఉబలాటంతో ఊపిరాడకుండా ఉన్న సరళ కళ్ళలో భవిష్యత్తు బంగారు లోకంగా కనిపించసాగింది.

మోకాళ్ళు వంగటం, నిటారు కావటం, మోకాలి చిప్ప కదలికను సాఫీగా సాగేటట్లు చేయటం అద్భుతంగా అనిపించింది డాక్టరుకు.

సరళను నిలబెట్టాలని డాక్టరు చేస్తున్న ప్రయత్నం అనుకున్నదానికంటే ముందుగా నెరవేరేటట్లు చేసింది సరళ.

పొడుగ్గా నిలబడ్డ తనను తాను చూసుకొని హృదయం ఉద్రూతలూగి పోతుంటే పట్టరాని పరవశం పొందింది సరళ.

చంకలో కర్రలు కాళ్ళకు ఊతం కాగా, సరళ సంపూర్ణ వ్యక్తిత్వానికి ఊతంగా డాక్టరు నిలబడి, పట్టుకొని, నడిచి, నడిపించి పొంగిపోతున్నాడు.

బాల్యంలో, అమ్మో, నాన్నో, అక్కో, అన్నో, అవ్వో, తాతో పట్టుకుంటే వేయవలసిన అడుగులు ఇవి అన్నీ అయిన ఆయన, డాక్టరు, పట్టుకొన్నప్పుడు వేసిన అడుగు సరళకు భూమి తిరుగుతూ ఉంటుందన్న సత్యాన్ని స్పష్టం చేసింది. పదహారు సంవత్సరాలకు పడిన మొదటి అడుగు ప్రపంచంమీద, ప్రకృతిమీద, ప్రాణం మీద, పరిసరాల మీద అంతులేని విశ్వాసం కలిగించింది.

డాక్టరు ఊతకర్ర కాకుండా పోయాడు.

సరళ చంకకర్రలతో నడిచింది. ఒక్కదానితో అడుగులు వేయసాగింది. అదీ లేకుండా తప్పటడుగులు వేసింది. చిన్నచిన్న అడుగులు పెద్ద పెద్ద అడుగులుగా మారాయి. అడుగులు నడక అయ్యాయి. నడక ఉరుకయింది. పరుగయింది. పడటం లేదు. నిలువునా నిటారుగా టేకు చెట్టులాగా నిలబడింది. తనను తాను చూచుకొని నిలువెల్ల పూసిన మందారమయింది సరళ.

"చూడు, నాకంటే పొడుగ్గా ఉన్నావు"

నవ్వింది.

"కాలేజీలో చేరతావు"

నవ్వింది.

"మంచి భర్త వస్తాడు"

నవ్వింది.

"సుఖ పడతావు"

ఏడ్చింది. కాళ్లమీద పడింది. వదలకుండా పట్టుకుంది.

మరుసటేడు కాలేజీలో చేరింది. ఇంటరు తర్వాత పెళ్లయింది. మంచి భర్త. మంచి ఉద్యోగం. ప్రేమగా చూసుకొనే సుకుమారుడు. సరళ నడచినా, పరుగెత్తినా సంసారం చేసినా, అన్ని సమయాలలో గుర్తుకు వచ్చే తొలి దేవుడు డాక్టరు రామారావు.

మూడేళ్ళకు ఇద్దరుపిల్లలు కలిగారు. డాక్టరు రామారావును సరళ దేవుడంటుంది. తల్లిదండ్రులు పూజిస్తారు. పటం పెట్టి దండు పెట్టుకొంటారు. అందరూ గౌరవిస్తున్నారు. సంఘంలో మర్యాదా మన్ననా పెరిగాయి.

తనకున్న పరిమిత వనరులతో, పరికరాలతో శాశ్వతంగా అంధకారం కావలసిన ఒక జీవితంలో వెలుగు నింపిన కృషిని భిన్న దశల్ని వ్యాసాలుగా వ్రాసి అంతర్జాతీయ సైన్సు

మెడిసన్ పత్రికలకు పంపాడు. ప్రపంచం గుర్తింపు వచ్చింది. భిన్న దశలో సరళ ఫోటోలు, అతుక్కున్న కాళ్ళు, చేసిన పరీక్షలు, వేరు చేస్సిన తీరు, వాడిన పరికరాలు, తీసుకున్న జాగ్రత్తలు, వివరిస్తూ సరళ ఇద్దరు పిల్ల తల్లి అయిందాకా తాను చేసిన వైద్యం గూర్చి వివరించాడు.

అది అటువంటి కేసుల్లో ఆదర్శం కాగలిగిన కేసు. దాన్ని మరింత అభివృద్ధి చేసి, శాశ్వతంగా మనుషులు అవిటి వాళ్ళుగా మిగిలిపోకుండా, మనిషిని, మానవజాతిని కాపాడే కృషిగా గుర్తించారు.

ప్రశంసలు ఆగిపోతాయి. రామారావు సరళ సంతోషంగా జీవించి గతిస్తారు. ఈ కృషి మాత్రం శాశ్వతంగా మిగులుతుంది.

అభినందించిన వాళ్ళ కంటే ఆశీర్వదించిన వాళ్ళపట్ల డాక్టరు రామారావు వినయవిధేయతలు చూపాడు.

ఈ కృషి లోకానికి మేలు.

ఈ ప్రయత్నం వల్ల డాక్టరు రామారావు మంచి గుర్తింపు పొందిన ధన్యుడు.

దీనికి పూర్తిగా సహకరించిన సరళ వికలాంగి కాక సుందరాంగి అయింది.

"అందరికీ ఆనందం కలిగించిన ఈ కృషికి, నా ఉద్యోగ జీవితానికి ప్రాణప్రతిష్ఠ కల్పించిన పుణ్యాత్ముడికి మాత్రం ఏ ప్రయోజనం లేదు"

"ఎవరాయన?" మిత్రులు అడిగారు. రైలు విజయవాడలో ఆగింది. మిత్రులింకా నిద్ర పోలేదు. ఎవరానందంలో వాళ్ళున్నారు. లోయర్ బెర్తులో పడుకొన్న పెద్దమనిషికి వీళ్ల ఆనందం నిద్ర చెడగొడుతూనే ఉండవచ్చు. నిర్విరామంగా అటునుంచి అటూ, ఇటునుంచి అటూ కదులుతూనే ఉన్నాడు.

"చాల్లే పడుకోండి" అంటాడేమోనని డాక్టరు రామారావు భయపడుతూ ఉన్నాడు.

"ఆయనకు నేను జీవితాంతం కృతజ్ఞుడిగానే ఉంటాను" అన్నాడు రామారావు.

""ఏం చేశాడు?"

"నాకు ఈ ఉద్యోగం రావటానికి ఆయనే కారణం. ఈ ఉద్యోగం లేకపోతే నేనీ కృషి చేసి ఉండేవాణ్ణికాదు."

"పియం? సీయం? సర్వీసు కమీషన్ ఛైర్మన్? మెంబరు? ప్రొఫెసరు? ఎవరు?"

"నా భార్య పెనకచర్ల స్కూలులో టీచరుగా పనిచేసేది. సంసారంతో మేం అనంతపురంలో ఉండే వాళ్ళం. నాకు యం.బి.బి.యస్. అయిపోయింది. ఏం ఉద్యోగం లేదు. ప్రయివేటు ప్రాక్టీసు ఇష్టం లేదు. ఉద్యోగం కోసం వెదుకుతూ ఉండేవాణ్ణి. ఏదీ కలిసిరాలేదు. సంవత్సరం నిరుద్యోగిగా ఉన్నాను.

"అలాగా?"

అందరికీ ఆశ్చర్యం. నిరుద్యోగిగా ఉంటూ భార్య సంపాదన మీద సంవత్సరం ఈ డాక్టరు బ్రతికాడంటే ఇప్పుడెవరూ నమ్మరు.

"గవర్నమెంటు కాలేజీలో లెక్చరరు పుణ్యాత్ముడు ఉండేవాడు. మాకు దూరపు బంధువు. డాక్టర్‌వై ఉండి, ఉద్యోగం లేకుండా, ప్రాక్టీసు లేకుండా భార్య జీతం మీద బ్రతకటానికి సిగ్గుగా లేదా అని తిట్టేవాడు"

"ఉద్యోగ ప్రకటన నేను చూడలేదు. తానూ ఆలస్యంగా చూశాడు. ఒక్కరోజే గడువు. తానింటికి వచ్చి అప్లికేషన్ ఫారం పూర్తిచేయించి, తానే పోస్టుచేశాడు. నేను ఆ విషయమే మర్చిపోయాను. ఒక రోజు యుపిపియస్ నుంచి ఇంటర్వ్యూ కార్డు వచ్చింది. ఈ ఉద్యోగంలో చేరాను. ఆ రోజు ఆయన ఆ చొరవ తీసుకొని ఉండకపోతే నేను ఏమయ్యేవాడినో. ఏం చేసే వాడినో. జీవితం ఏం మలుపు తిరిగేదో–"

"ఆయనిప్పుడెక్కడున్నాడో తెలుసా?"

"తెలియదు! రిటైరై, స్వగ్రామం పోకుండా హైద్రాబాదులో వైద్య సదుపాయాల నిమిత్తం ఉండిపోయాడని విన్నాను. ఎక్కడున్నాడో తెలియదు!"

"కలవటానికి ప్రయత్నించక పోయారా?"

"వీలు కాలేదు!"

లోయర్ బెర్త్‌లో పడుకొన్న పెద్దమనిషి లేచి, లైటు వేసి, డాక్టరు రామారావుదగ్గరకు పోయి, చెంపలు నిమిరి, నుదుటి మీద ముద్దు పెట్టుకొని, "నాకింతకంటే ఆనందం ఏం కావాలి రామారావు" అనగానే పెద్దమనిషి కాళ్ల మీద వాలిపోయాడు, కృతజ్ఞతా భారంతో తలవంచుకొని డాక్టరు రామారావు.